క్లుప్తంగా

దత్తాత్రేయ స్వామికి విశేష పూజలు



శ్రీశైలం టెంపుల్: లోకకల్యాణం కోసం దేవస్థానం గురువారం ఆలయ ప్రాంగణంలోని త్రిఫల వృక్షం కింద వెలసిన దత్తాత్రేయ స్వామివారికి విశేష పూజలను నిర్వహించింది. పూజాకార్యక్రమం నిర్విఘ్నంగా జరిగేందుకు ముందుగా మహాగణపతిపూజను జరిపించారు. తరువాత దత్తాత్రేయస్వామివారికి పంచామృతాభిషేకం, విశేష పూజలు నిర్వహించారు.

బక్రీద్ పండుగను ప్రశాంతంగా జరుపుకోవాలి



మత పెద్దల సమావేశంలో మాట్లాడుతున్న టౌన్ సీఐ ప్రకాష్‌కుమార్

నందికొట్కూరు: పట్టణంలోని ముస్లిం సోదరులు బక్రీద్ పండుగను ప్రశాంతంగా జరుపుకోవాలని టౌన్ సీఐ ప్రకాష్‌కుమార్ అన్నారు. గురువారం పట్టణంలోని పోలీసు స్టేషన్ ఆవరణలో ముస్లిం, హిందూ మత పెద్దలతో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. జిల్లా ఎస్పీ ఆదేశాల మేరకు బక్రీద్ పండుగను ప్రశాంతంగా నిర్వహించుకోవాలని కోరారు. ఎలాంటి సమస్యలు వచ్చిన వెంటనే పోలీసులకు సమాచారం అందించాలని సూచించారు. అల్లర్లు సృష్టిస్తే చట్టపరమైన చర్యలు తప్పవని హెచ్చరించారు.

20న మోడల్‌స్కూల్ ప్రవేశ పరీక్ష

పాములపాడు: స్థానిక ఏపీ ఆదర్శ పాఠశాలలో 7, 8, 9 తరగతుల్లో మిగిలి ఉన్న సీట్ల భర్తీకి ఈ నెల 20న ప్రవేశ పరీక్ష నిర్వహించనున్నట్లు ప్రిన్సిపాల్ నాగరవీంద్ర తెలిపారు. గురువారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ విద్యార్థుల నుంచి దరఖాస్తులు స్వీకరిస్తున్నామని, ఈ నెల 18వ తేదీ ఆఖరు అని చెప్పారు. 20 వతేదీ ఉదయం 9గంటలకు పాఠశాల ఆవరణలో ప్రవేశ పరీక్ష ఉంటుందన్నారు. మెరిట్ ప్రకారం ప్రవేశాలు ఉంటాయని వివరించారు. ఆసక్తి గల విద్యార్థులు పూర్తి వివరాలకు పాఠశాలలో సంప్రదించాలని సూచించారు.

అలరించిన భజన కార్యక్రమం



భజన కార్యక్రమం నిర్వహిస్తున్న కళాకారులు

శ్రీశైలం టెంపుల్: శ్రీశైల దేవస్థానం నిర్వహిస్తున్న ధర్మపథంలో భాగంగా గురువారం ఆలయ దక్షిణ మాడవీధిలోని నిత్యకళారాధన వేదిక వద్ద నంద్యాలకు చెందిన సీతారామాంజనేయస్వామి భజన మండలి వారిచే భజన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమములో వినాయకస్తుతి, లింగాష్టకం, శ్రీశైలవాసా శ్రీమల్లికార్జున, శైలం శివమయం, కరుణించరా శంకరా, శివశివశంకరా, శంభో శంభో తదితర భక్తిగీతాలు, అష్టకాలను మండ్ల రాము, దివాకర్ రెడ్డి, వెంకటరమణ, బాబు, వెంకటస్వామి, పాపయ్య, మద్దయ్య, పవన్, శేఖర్, పుల్లయ్య, మధు, హరి, జనార్దన్‌రెడ్డి, మహేష్, వెంకటరమణ, శేఖర్ నాయుడు, కార్తిక్, మద్దిలేటి తదితరులు ఆలపించారు.

యువకుడి ఆత్మహత్య

మిడుతూరు: మండల పరిధిలోని దేవనూరు గ్రామానికి చెందిన ఓ యువకుడు అప్పుల బాధ తాళలేక పురుగు మందు తాగి ఆత్మహత్య చేసుకున్న ఘటన గురువారం చోటుచేసుకుంది. ఎస్ఐ జగన్‌మోహన్ తెలిపిన వివరాల మేరకు దేవనూరు గ్రామానికి చెందిన మహమ్మద్ రఫి (38)కి రెండు ఎకరాల పొలం ఉండగా, ఇతర పొలాలు కూడా కౌలుకు తీసుకొని వ్యవసాయం చేసేవాడు. ఈ నేపథ్యంలో పెట్టుబడులు, సొంత ఖర్చుల నిమిత్తం దాదాపు రూ.10 లక్షలు అప్పు చేశాడు. దానిని తీర్చే మార్గం కనిపించక మనస్తాపం చెంది గురువారం ఉదయం బాత్ రూంలోకి వెళ్లి పురుగు మందు తాగాడు. తండ్రి నూర్‌బాషా గమనించి చికిత్స నిమిత్తం కర్నూలు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించగా.. అప్పటికే మృతిచెందినట్లు డాక్టర్ ధ్రువీకరించారు. మృతుడికి భార్య, ఇద్దరు కూతుళ్లు, కుమారుడు ఉన్నారు. మృతుడి తండ్రి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

20 నుంచి మాన్యం కౌలుకు వేలాలు

శిరివెళ్ల: ఈ నెల 20వ తేదీ నుంచి వివిధ ఆలయాల మాన్యం కౌలుకు బహిరంగ వేలం పాటలను నిర్వహిస్తున్నట్లు కోటపాడు గ్రూప్ ఆలయాల ఈఓ వేణునాథరెడ్డి గురువారం తెలిపారు. 20న శిరివెళ్లలోని శ్రీ ఓంకారేశ్వరస్వామి ఆలయం భూములు, 21న బోయలకుంట్లోని శ్రీ రామేశ్వరస్వామి, వీరభద్ర, శ్రీ అనంత పద్మనాభ స్వామి ఆలయాల భూములు, 23న కోటపాడులోని శ్రీ వీరభద్ర, చెన్న కేశవస్వామి ఆలయాల మాన్యం కౌలు బహిరంగ వేలం పాటలను జరుగుతాయన్నారు. వేలంలో పాల్గొనే వారు రూ. 5 వేలు డిపాజిట్లు చెల్లించాలని, ఆలయాలకు బకాయిలున్న వారు పాటలకు అనర్హులని స్పష్టం చేశారు.



ఉన్నత పాఠశాలలో నాడు-నేడు కింద మంజూరైన టేబుళ్లపై కూర్చొన్న విద్యార్థులు



పడమర ప్రాతకోటలో టీసీ కోసం వచ్చిన విద్యార్థిని



రుద్రవరం ప్రాథమిక పాఠశాలలో కేవలం ఐదుగురు మాత్రమే హాజరైన విద్యార్థులు



ఇంటింటికీ వెళ్లి విద్యార్థులను బడికి పంపాలని తల్లిదండ్రులతో మాట్లాడుతున్న ఉపాధ్యాయులు

బడిగంట మోగింది

- పాఠశాలలు పునఃప్రారంభం
- తొలిరోజు అంతంత మాత్రంగానే హాజరు
- పలు చోట్ల విద్యార్థులకు పుస్తకాల పంపిణీ
- విద్యార్థులను బడికి పంపాలని ఉపాధ్యాయుల ఇంటింటి ప్రచారం



మోడల్ పాఠశాలలో విద్యార్థులకు పాఠ్య, నోట్‌పుస్తకాలు పంపిణీ చేస్తున్న ప్రిన్సిపాల్ రమేష్, పీఎంసీ కమిటీ చైర్మన్ గోవర్ధన్, ఉపాధ్యాయులు

జూపాడుబంగ్లా: 2024-25 విద్యాసంవత్సరానికి గాను గురువారం బడిగంట మోగింది. మండలం వ్యాప్తంగా ఉన్నత పాఠశాలలు 8, ప్రాథమికోన్నత పాఠశాలలు 3, ప్రాథమిక పాఠశాలలు 28 కలిపి మొత్తం 39 పాఠశాలలుండగా 4,048 మంది విద్యార్థులున్నారు. మొదటి రోజు పాఠశాలలు ప్రారంభం కాగా జంగాలపేట ప్రాథమిక పాఠశాల ఉపాధ్యాయులు ఇంటింటికి వెళ్లి విద్యార్థులను బడికి పంపించాలని కోరారు. కొత్తగా విద్యార్థులను పాఠశాలల్లో చేర్పించేందుకు తల్లిదండ్రులు పాఠశాలల వద్ద క్యూ కట్టారు. అలాగే మోడల్ స్కూల్, గురుకుల పాఠశాలల్లో ప్రవేశాలకు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకొని ప్రవేశపరీక్షల్లో ఉత్తీర్ణత సాధించిన విద్యార్థులను తల్లిదండ్రులు పాఠశాలల్లో చేర్పించారు. మొదటి రోజు పాఠశాలలకు విద్యార్థులు అరకొరగా హాజరుకాగా వారికి మధ్యాహ్న భోజన నిర్వాహకులు భోజనం వండిపెట్టినప్పటికీ.. చాలా మంది విద్యార్థులు ఇళ్లనుంచి క్యారియర్ తెచ్చుకొని తిన్నారు. మొదటి రోజు పాఠశాలలకు పూర్తిస్థాయిలో హాజరైన ఉపాధ్యాయులు విద్యార్థులకు పాఠ్యాంశాల బోధనపై తగిన ప్రణాళికలు రూపొందించుకోవడంతో పాటు వాటి అమలు విషయమై ప్రధానోపాధ్యాయులు సమావేశాలు నిర్వహించుకున్నారు. మోడల్ పాఠశాలలో విద్యార్థులకు పాఠ్యపుస్తకాలను పంపిణీ చేశారు. అన్ని పాఠశాలల ఉపాధ్యాయులు సత్వరమే విద్యార్థులకు పాఠ్య, నోట్‌పుస్తకాలు పంపిణీ చేయాలని ఎంఈఓ-1, 2 చిన్నమద్దిలేటి, శ్రీనివాసులు పాఠశాలల హెచ్‌ఎంలకు సూచించారు.

తెరుచుకున్న బడి తలుపులు



జూపాడుబంగ్లా ఉన్నత పాఠశాలలో బడిగంట మోగిస్తున్న అటెండర్

పగిడ్యాల: వేసవి సెలవులు ముగిసిన అనంతరం గురువారం బడి తలుపులు తెరుచుకున్నాయి. విద్యార్థులు తక్కువ సంఖ్యలో పాఠశాలలకు హాజరయ్యారు. కొన్ని పాఠశాలలో విద్యార్థులే అన్ని తామై పనులను చేసుకుంటూ కనిపించారు. మొదటి రోజు కావడం వలన పిల్లలు మరీ తక్కువ సంఖ్యలో కనిపించగా ఉపాధ్యాయులు ప్రార్థన కూడా నిర్వహించలేదు. పదో తరగతి పాసైన విద్యార్థులు టీసీలు తీసుకునేందుకు రావడం విశేషం. కాగా, ప్రభుత్వం మారడంతో ప్రభుత్వ పాఠశాలల పరిస్థితి ఎలా ఉంటుందోననే సందేహంతో కొంత మంది విద్యార్థులను ప్రైవేట్, కస్తూర్బా పాఠశాలల్లో చేర్పించేందుకు తల్లిదండ్రులు టీసీ కోసం క్యూ కట్టారు. మొదటి రోజున మండల వ్యాప్తంగా 40 శాతం హాజరు నమోదైనట్లు విద్యాధికారి సుభాన్ స్పష్టం చేశారు.

పాములపాడులో 30 శాతం హాజరు

పాములపాడు: పాఠశాలలు గురువారం పునఃప్రారంభమయ్యాయి. విద్యార్థులు కేవలం 30 శాతం మాత్రమే తరగతులకు హాజరయ్యారు. స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ప్రధానోపాధ్యాయురాలు వెంకటసుబ్బమ్మ ఇటీవల పదవీ విరమణ పొందారు. దీంతో ఇన్‌చార్జ్ ప్రధానోపాధ్యాయుడుగా గోపాల్ బాధ్యతలు చేపట్టారు. 10వ తరగతి ఉత్తీర్ణులైన విద్యార్థులు టీసీలు తీసుకెళ్లగా, క్లర్కులు విద్యార్థులు హాజరుపట్టీలు రాయడం, టీసీలు సిద్ధం చేసే పనిలో నిమగ్నమయ్యారు. కొన్ని పాఠశాలల్లో విద్యార్థులకు పాఠ్యపుస్తకాలు పంపిణీ చేశారు.

పాఠశాలలకు పుస్తకాలు అందజేత

కొత్తపల్లి: మండలంలోని అన్ని ప్రభుత్వ పాఠశాలలకు నోట్, టెక్స్ట్ పుస్తకాలను అందజేశామని ఎంఈఓలు శ్రీరాములు, ఇనాయతుల్లా తెలిపారు. గురువారం స్థానిక జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాలల ఉపాధ్యాయులకు వాటిని పంపిణీ చేశారు. ఎంఈఓ మాట్లాడుతూ మండలంలోని అన్ని ప్రభుత్వ పాఠశాలలు పునఃప్రారంభం అయ్యాయన్నారు. విద్యార్థులకు ఎటువంటి ఇబ్బంది లేకుండా పాఠ్యాంశాలు చెప్పేందుకు పుస్తకాలను అన్ని పాఠశాలల సిబ్బందికి అందజేశామన్నారు. ఉపాధ్యాయులు విద్యార్థుల ఇళ్ల వద్దకు వెళ్లి మరీ బడులకు రావాలని పిలిచి తీసుకువచ్చారు.



మిడుతూరు ఆదర్శ పాఠశాలలో విద్యార్థులకు మధ్యాహ్న భోజనం వడ్డిస్తున్న దృశ్యం

చిన్నారులను బడికి పంపండి

మహానంది: చిన్నారులను అంగన్‌వాడీ కేంద్రాలు, ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించాలని డీపీఈపీ ప్రాథమిక పాఠశాల హెడ్‌మాస్టర్ శ్రీనివాసులు, అంగన్‌వాడీ టీచర్లు కోరారు. గురువారం మహానంది మండలంలోని అన్ని గ్రామాల్లో ప్రభుత్వ పాఠశాల హెచ్‌ఎంలు, అంగన్‌వాడీ టీచర్లు బడిబాట కార్యక్రమాన్ని నిర్వహించారు. వారు మాట్లాడుతూ ఐదేళ్లలోపు చిన్నారులను అంగన్‌వాడీ కేంద్రాలలో చేర్పించాలన్నారు. చిన్నప్పటి నుంచే పిల్లలను పాఠశాలలకు అలవాటు చేయించడం ద్వారా విద్యా ప్రమాణాలు మెరుగుపడతాయన్నారు.



ఉపాధ్యాయులకు పుస్తకాలు పంపిణీ చేస్తున్న దృశ్యం



జంగాలపేట ప్రాథమిక పాఠశాలలో బిడ్డకు అడ్మిషన్ తీసుకుంటున్న తల్లి

పుస్తకాల పంపిణీ



కలమందలపాడు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు పుస్తకాలు పంపిణీ చేస్తున్న దృశ్యం

మిడుతూరు: మండలపరిధిలోని ప్రాథమిక, ప్రాథమికోన్నత, ఆదర్శ పాఠశాల, కస్తూర్బా బాలికల విద్యాలయం, ఉన్నత పాఠశాలలు గురువారం పునఃప్రారంభమయ్యాయి. పాఠశాలలు ప్రారంభం రోజున తరగతి గదులలో విద్యార్థుల హాజరు శాతం తక్కువగా ఉంది. మండల కేంద్రం నుంచి విద్యార్థులకు మంజూరైన పాఠ్య పుస్తకాలు, నోట్ పుస్తకాలు, బెల్టులు, టై, తదితర వాటిని వారి పాఠశాలకు ఉపాధ్యాయులు తీసుకెళ్లారు. అదేవిధంగా మండలంలోని కలమందలపాడు, చౌట్కూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలల్లో పాఠ్యపుస్తకాలు, నోట్ పుస్తకాలు విద్యార్థులకు పంపిణీ చేసినట్లు ఆయా పాఠశాలల ప్రధానోపాధ్యాయులు మల్లికార్జున నాయక్, రవిప్రకాష్ రావు తెలిపారు.

వేలాలతో మహానందీశ్వర స్వామికి భారీ ఆదాయం



మహానందిలో వేలాలు నిర్వహిస్తున్న ఈఓ, సిబ్బంది

మహానంది: మహానంది దేవస్థానంలోని పోచా బ్రహ్మానందరెడ్డి విశ్రాంతి భవనంలో గురువారం వివిధ అంశాలకు నిర్వహించిన బహిరంగ వేలాల ద్వారా మహానందీశ్వర స్వామికి భారీ ఆదాయం సమకూరింది. ఆలయ ఈఓ కాపు చంద్రశేఖర్ రెడ్డి ఆధ్వర్యంలో వేలాలు నిర్వహించారు. దేవస్థానానికి చెందిన భూముల ద్వారా ఏడాదికి రూ.14, 32,900 ఆదాయం వచ్చింది. కరివేన బ్రాహ్మణ అన్న సత్రం ఎదురుగా ఉన్న ఖాళీ స్థలంలో ప్రస్తుతం నిర్వహిస్తున్న అన్నపూర్ణ హోటల్ బాడుగ నెలకు రూ.1,96,170 ఉండగా రూ.2,01,500 చొప్పున గంగిశెట్టి రమణమ్మ దక్కించుకున్నారు. ఆలయంలో ఉన్న అల్యూమినియం పాత్రలను విక్రయించేందుకు కిలో రూ.145 ప్రకారం నంద్యాలకు చెందిన చిన్న ఉసేని హక్కు పొందారు. జేఎస్‌డబ్ల్యూ ఆధ్వర్యంలో నూతనంగా నిర్మించిన మరుగుదొడ్ల నిర్వహణకు మహానందికి చెందిన స్వప్నకుమారి ఏడాదికి రూ.4,50,000తో దక్కించుకున్నట్లు వివరించారు. కార్యక్రమంలో ఏఈఓలు మధు, ఓంకారం వేంకటేశ్వరుడు, పలు గ్రామాల రైతులు పాల్గొన్నారు.

మద్యం దుకాణాల ఉద్యోగులకు న్యాయం చేయాలి



ప్రభుత్వ మద్యం దుకాణం వద్ద నిరసన వ్యక్తం చేస్తున్న ఉద్యోగులు

కొత్తపల్లి: రాష్ట్ర వ్యాప్తంగా ప్రభుత్వం నిర్వహిస్తున్న మద్యం దుకాణాల్లో పనిచేస్తున్న ఉద్యోగులకు న్యాయం చేయాలని సూపర్‌వైజర్ శాలి సాహెబ్, సేల్స్ మెన్లు మధుబాబు, వెంకట లింగమయ్య కోరారు. గురువారం స్థానిక ప్రభుత్వ మద్యం దుకాణం వద్ద నిరసన వ్యక్తం చేశారు. వారు మాట్లాడుతూ.. 2019లో అప్పటి ప్రభుత్వం ప్రైవేట్ మద్యం దుకాణాలను రద్దు చేసి సొంతంగా దుకాణాలను ఏర్పాటు చేసిందన్నారు. అర్హతను బట్టి ఉద్యోగులను నియమించిందని తెలిపారు. వీటి వల్ల రాష్ట్ర వ్యాప్తంగా 18 వేల మంది ఉపాధి పొందుతున్నారన్నారు. ప్రస్తుతం టీడీపీ అధికారంలోకి రావడంతో ప్రభుత్వం మద్యం దుకాణాలను రద్దు చేసి పాత పద్ధతిలో ప్రైవేట్ వ్యక్తులకు టెండర్ల ద్వారా ఇచ్చేందుకు ప్రయత్నాలు చేస్తున్నట్లు తమ దృష్టికి వచ్చిందన్నారు. మద్యం దుకాణాలను ప్రైవేట్ వ్యక్తులకు అప్పగిస్తే అందులో పని చేస్తున్న 18 వేల కుటుంబాలు రోడ్డున పడే అవకాశం ఉందని ఆందోళన వ్యక్తం చేశారు. ప్రభుత్వం తమ విద్యార్హత, సీనియారిటీని పరిగణనలోకి తీసుకుని మరో డిపార్టుమెంట్‌కు సేవలను వినియోగించుకుని న్యాయం చేయాలని కోరారు. కార్యక్రమంలో వాచ్‌మెన్‌లు హుస్సేన్ మియా, మధుసూదన్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

బండలాగుడు విజేత గుడిపాడు ఎద్దులు



రాతి దులాన్ని లాగుతున్న ఎద్దులు

చాగలమర్రి: స్థానిక చెరువ కట్టపై వెలసిన దస్తగిరి స్వామి ఉరుసు సందర్భంగా గురువారం నిర్వహించిన సేద్యపు ఎద్దుల రాతి దూలం లాగుడు పోటీల్లో వైఎస్సార్ జిల్లా, దువ్వూరు మండలం, గుడిపాడు గ్రామానికి చెందిన నారాయణరెడ్డి ఎద్దులు ప్రథమ స్థానంలో నిలిచి రూ.40వేల నగదు బహుమతిని గెలుపొందాయి. పోటీల్లో మొత్తం 16 జతల ఎద్దులు పాల్గొన్నాయి. ఆ తరువాతి స్థానాల్లో నిలిచిన ఎద్దులను దర్గా కమిటీ సభ్యులు ప్రకటించారు. వరుసగా..ప్రొద్దుటూరు, చెన్నూరు మండలం ఓబులంపల్లి, ప్రొద్దుటూరు, యర్రగుంట్ల, పోతిరెడ్డిపల్లి, చెరువుకిందపల్లి గ్రామాలకు చెందిన ఎద్దుల యజమానులకు దాతల సహకారంతో రూ.30వేలు, రూ.20వేలు, రూ.15వేలు, రూ.10వేలు, రూ.5వేలు, రూ.3వేలు, 2వేల నగదు అందజేశారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ ఎం.ఎస్.అన్సర్‌బాషా, దర్గా కమిటీ సభ్యులు ముల్లా మౌలాలి, హనీఫ్,ఖలీల్, దాతలు పాల్గొన్నారు.

18నుంచి డిగ్రీ కళాశాలలో అడ్మిషన్లు

నంద్యాల(న్యూటౌన్): 2024-25 విద్యాసంవత్సరానికి ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ప్రవేశానికి అడ్మిషన్లు ఈనెల 18వ తేదీ నుంచి ప్రారంభమవుతాయని స్థానిక ప్రభుత్వ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ శశికళ గురువారం తెలిపారు. ఇంటర్మీడియెట్ పూర్తి చేసిన విద్యార్థులు డిగ్రీలో చేరేందుకు అడ్మిషన్లు పొందాలన్నారు. ఈ విద్యాసంవత్సరంలో 8 సింగిల్ మేజర్ ప్రోగ్రామ్స్‌లో విద్యను అందిస్తున్నట్లు తెలిపారు. బీఏ, ఎకనామిక్స్, బీఏ పొలిటికల్ సైన్స్, బీకాం జనరల్, బీకాం కంప్యూటర్ అప్లికేషన్స్, బీఎస్సీ మేథమేటిక్స్, బీఎస్సీ కెమిస్ట్రీ, బీఎస్సీ కంప్యూటర్ సైన్స్, బీఎస్సీ జువాలజీ కోర్సులు అందుబాటులో ఉన్నాయని వివరించారు. ఆయా కోర్సులకు ప్రభుత్వం నిర్ణయించిన ఫీజును మాత్రమే వసూలు చేస్తామన్నారు. డిజిటల్ క్లాస్ రూమ్స్, ల్యాబ్స్, లైబ్రరీ, నూతన కంప్యూటర్ ల్యాబ్ తదితర సౌకర్యాలన్నీ కళాశాలలో ఉన్నాయని చెప్పారు. అర్హులైన విద్యార్థులకు ప్రభుత్వ స్కాలర్ షిప్‌లు అందజేస్తామన్నారు. కాలేజీలో చేరే విద్యార్థులు రెండు ఫొటోలు, ఆధార్‌కార్డు, ఇంటర్మీడియెట్ మార్క్‌లిస్ట్, టీసీ, స్టడీ, పదవ తరగతి మార్కుల లిస్ట్, ఒరిజినల్ కాపీలతో రావాలని సూచించారు.

ముసుగు తొలగించిన అధికారులు

సాక్షి ఎఫెక్ట్

ఆత్మకూరు రూరల్: ఎన్నికల కోడ్ ముగిసి వారం అయినప్పటికీ పట్టణంలోని దివంగత వైఎస్ రాజశేఖరరెడ్డి విగ్రహానికి వేసిన ముసుగును అధికారులు తొలగించకపోవడంపై ఈనెల 13న 'సాక్షి'లో 'కోడ్ ముగిసినా.. తొలగని ముసుగు' అనే శీర్షికన కథనం ప్రచురితమైంది. దీంతో స్పందించిన ఆత్మకూరు మున్సిపల్ అధికారులు గురువారం దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖరరెడ్డి విగ్రహానికున్న ముసుగు తొలగించారు. అలాగే గ్రామాల్లో ముసుగు తొలగించని విగ్రహాలకు వెంటనే ముసుగు తొలగించాల్సిందిగా ప్రజలు కోరుతున్నారు.

కోతకు గురైన రహదారుల మరమ్మతులు



మట్టి వేసి గుంతలను పూడుస్తున్న జేసీబీ

మిడుతూరు: మిడుతూరు - గార్గేయపురం వెళ్లే రహదారిలో పీరుసాహెబ్ పేట - కడుమూరు గ్రామాల మధ్య ఇటీవల కురిసిన భారీ వర్షాలకు రహదారి కోతకు గురైంది. దీంతో ప్రమాదాలు జరిగే అవకాశం ఉందని ఈ నెల 9న సాక్షి దినపత్రికలో 'భారీ వర్షాలు .. నేల కోతలు' అనే శీర్షికన కథనం ప్రచురితమైంది. దీనికి స్పందించిన ఆర్‌అండ్‌బీ అధికారులు కోతకు గురైన ప్రాంతంలో ప్రమాదాలు చోటుచేసుకోకుండా రహదారి పక్కన గ్రావెల్ వదిలి జేసీబీ సహాయంతో గురువారం మరమ్మతులు చేపట్టారు.

ఎస్సీ వసతిగృహంలో ప్రవేశానికి దరఖాస్తుల ఆహ్వానం

ఆత్మకూరు: మండలంలోని వెంకటాపురం ఎస్సీ వసతిగృహంలో విద్యార్థులకు 45 సీట్లు ఖాళీగా ఉన్నాయని హెచ్‌డబ్ల్యూఓ అంకన్న తెలిపారు. గురువారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ తమ వసతిగృహంలో సీట్లు ఖాళీగా ఉన్నందున 3వ తరగతి నుంచి 8వ తరగతి విద్యార్థులను చేర్చుకునేందుకు దరఖాస్తులను ఆహ్వానిస్తున్నామన్నారు. ఆత్మకూరు మండల, ఇతర మండలాలకు చెందిన నిరుపేద విద్యార్థులు దరఖాస్తులు చేసుకోవాలన్నారు. అర్హులైన విద్యార్థులకు వసతిగృహంలో దరఖాస్తులను పరిశీలించి సీట్లు భర్తీ చేస్తామన్నారు. ఈ అవకాశాన్ని విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

బీసీజీ వ్యాక్సిన్ తప్పని సరిగా వేయించుకోవాలి



వ్యాక్సినేషన్ పరిశీలిస్తున్న డాక్టర్ నాగలక్ష్మిదేవి

పాములపాడు: దీర్ఘ కాలిక రోగాలున్న వారు బీసీజీ వ్యాక్సిన్ తప్పని సరిగా వేయించుకోవాలని డాక్టర్ నాగలక్ష్మిదేవి అన్నారు. గురువారం మండలంలోని యర్రగూడూరు గ్రామంలో వ్యాక్సినేషన్‌ను పరిశీలించారు. డాక్టర్ మాట్లాడుతూ బీసీజీ టీకాను 5 సంవత్సరముల క్రితం క్షయ వ్యాధికి గురి అయిన వారు, వారి కుటుంబ సభ్యులు, 60 సంవత్సరముల వయస్సు దాటిన వారు, షుగర్ పేషంట్లు, పొగతాగే అలవాటు ఉన్నవారు, పోషకాహారం లోపం ఉన్న వారు తప్పని సరిగా వేయించుకోవాలని సూచించారు. ప్రతి సోమవారం, గురువారాల్లో అన్ని గ్రామాల్లో వైద్య సిబ్బంది ఉచితంగా ఈ టీకాను వేయడం జరుగుతుందన్నారు. మండలాన్ని క్షయ వ్యాధి రహిత మండలంగా మార్చాలని పేర్కొన్నారు. కార్యక్రమంలో హెల్త్ ఎడ్యుకేటర్ మల్లికార్జున, ముర్తుజావలి, ఆరోగ్య కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో ఆంథోని జయంతి



పునీత్ ఆంథోనికి గ్రామోత్సవం నిర్వహిస్తున్న దృశ్యం

నంద్యాల(అర్బన్): పునీత్ ఆంథోనిని ప్రార్థిస్తే అద్భుతాలు జరుగుతాయని కర్నూలు మేత్రాసన పీఠాధిపతి గోరంట్ల జ్వాన్నేస్ తెలిపారు. మండలంలోని చాపిరేవుల గ్రామంలో వెలసిన పునీత్ ఆంథోని పుణ్యక్షేత్రంలో గురువారం ఆంథోని జయంతి వేడుకల్లో కర్నూలు, అనంతపురం, కడప జిల్లాల క్రైస్తవులు పాల్గొని ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. ఫాదర్ మర్రెడ్డి, గురువులు ఫాదర్ కిశోర్, ఏసుపాదం, కేథలిక్ గురువులు పాల్గొన్నారు.

చదువుతోనే బంగారు భవిష్యత్

దొర్నిపాడు: బాలలకు చదువే బంగారు భవిష్యత్‌ను ఇస్తుందని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ ప్రభాకరమ్మ తెలిపారు. గురువారం మండలంలోని డబ్ల్యూ గోవిందిన్నె అంగన్‌వాడీ కేంద్రం-1లో 11-18 సంవత్సరాల బాలబాలికలకు బాల సభ నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల్లో ప్రభుత్వం అన్ని రకాలుగా వసతులు కల్పిస్తుందని, బాగా చదువుకోవాలని సూచించారు. బాల్యవివాహాలు చేసినా, ప్రోత్సహించినా చట్టరీత్యా నేరం అన్నారు.

ప్రభుత్వ కళాశాలలో తరగతులు కొనసాగించాలి

ఆత్మకూరు: పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో తరగతులు కొనసాగించాలని ఆత్మకూరు ఎస్ఎఫ్ఐ పట్టణ కార్యదర్శి కె.దినేష్‌కుమార్ డిమాండ్ చేశారు. గురువారం పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల వద్దకు వెళ్లి పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రారంభమై 14 రోజులు కావొస్తున్నా విద్యార్థులు పూర్తి స్థాయిలో రావడం లేదనే నెపంతో తరగతులు నిర్వహించడంలేదన్నారు. దీంతో విద్యార్థులు విద్యకు దూరమయ్యే అవకాశం ఉందన్నారు. అలాగే ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ప్రతి గ్రూప్‌కి సంబంధించి అధ్యాపకులను నియమించాలని, అధ్యాపకులు ఉన్న రెండో సంవత్సరం విద్యార్థులకు ఇంకా తరగతులు ఎందుకు నిర్వహించలేదని వారు ప్రశ్నించారు. విద్యార్థుల జీవితాలను దృష్టిలో ఉంచుకొని అధ్యాపకులు పని చేయాలన్నారు. కార్యక్రమంలో ఆత్మకూరు పట్టణ ఎస్ఎఫ్ఐ నాయకులు సాయి, దిలీప్, చందు తదితరులు పాల్గొన్నారు.

వ్యక్తిపై గొడ్డలితో దాడి



గొడ్డలి దాడిలో గాయపడిన చెరకు స్వాములు

పగిడ్యాల: ఓ కామాంధుడు వ్యక్తిపై గొడ్డలితో దాడి చేసిన ఘటన గురువారం రాత్రి నెహ్రూనగర్‌లో చోటుచేసుకుంది. గ్రామస్తులు, బంధువులు తెలిపిన వివరాల మేరకు.. గ్రామానికి చెందిన చెరకు స్వాములు అన్న కూతురైన పద్మావతి భర్త చనిపోవడంతో తొమ్మిదేళ్లుగా నెహ్రూనగర్‌లోనే నివాసం ఉంటోంది. ఇదే గ్రామానికి చెందిన పాలమర్రి తిక్కస్వామి ఆమెపై మనసుపడి వేధించసాగాడు. దీంతో పద్మావతి తన చిన్నాన్న స్వాములుకు విషయం చెప్పింది. ఈ విషయంపై వారు నెలరోజుల క్రితం ముచ్చుమర్రి పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. దీంతో పోలీసులు తిక్కస్వామిని స్టేషన్‌కు పిలిపించి హెచ్చరించి పంపారు. అయినా పద్ధతి మార్చుకోకుండా రాత్రిళ్లు పద్మావతికి ఫోన్ చేసి మళ్లీ వేధించసాగాడు. దీంతో ఆమె పంచాయతీ పెట్టించాలని తన రక్తసంబంధీకులను పిలిపించుకుంది. ఇది జీర్ణించుకోలేని తిక్కస్వామి గురువారం రాత్రి గ్రామంలోని బలిజ చిన్న వెంకటేశ్వర్లు ఇంటి వద్ద ఉన్న స్వాములుపై గొడ్డలితో విచక్షణా రహితంగా దాడి చేశాడు. తీవ్ర రక్తస్రావం కావడంతో స్వాములు అక్కడికక్కడే కుప్పకూలాడు. గమనించిన నిందితుడు అక్కడి నుంచి పరారయ్యాడు. ప్రాణాపాయ స్థితిలో ఉన్న స్వాములును కుటుంబసభ్యులు నందికొట్కూరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. అక్కడ ప్రథమ చికిత్స అనంతరం వైద్యులు మెరుగైన వైద్యం కోసం కర్నూలుకు రెఫర్ చేశారు. సమాచారం అందుకున్న ముచ్చుమర్రి పోలీసులు నెహ్రూనగర్‌కు చేరుకుని నిందితుడి కోసం గాలింపు చర్యలు చేపట్టారు. అయితే నిందితుడు ముందస్తు ప్రణాళికతో భార్యాపిల్లలతో కలిసి ఊరినుంచి పరారైనట్లు గ్రామస్తులు తెలిపారు.